మెనూ ప్రకారం భోజనం అందించాలి

బుడ్మి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

బాన్సువాడ రూరల్, ఆగస్టు 13 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని బాన్సువాడ ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని బుడ్మి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించరాదని, నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

మైనార్టీ గురుకుల కళాశాల పరిశీలన

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్

కామారెడ్డి, ఆగస్టు 13 : పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ కిరణ్‌గౌడ్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. కళాశాలలోని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అన్ని రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగెల్‌కు నివాళి

బాన్సువాడ, ఆగస్టు 13 : బాన్సువాడ ఏరియా దవాఖాన సిబ్బంది ఫ్లోరెన్స్ నైటింగెల్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, కృష్ణవేణి, శాంతాకుమారి, భవాణి, ఆరోగ్య జ్యోతి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

జెండా పండుగకు సిద్ధం చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 13 : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. వేడుకలకు స్టేడియాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయించాలని మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. జెండా ఏర్పాట్లు, స్టేడియాన్ని సిద్ధం చేయడం తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. శకటాలు తిరిగే ప్రదేశం, స్టాళ్లు ఏర్పాటు చేసే స్థలం, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు. సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయడానికి ఈ నెల 14లోగా ప్రతిపాదనలు పంపాలన్నారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిరిసిల్ల రోడ్‌లోని రాజీవ్ పార్క్‌ను పరిశీలించారు. పార్క్ నిర్మాణం ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, ఆర్డీవో రంగనాథ్ రావు, డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 13 : లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని లేకపోతే రైస్ మిల్ యజమానులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో సీఎంఆర్ డెలివరీపై సివిల్ సప్లై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు రైసు మిల్లులను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ డెలివరీ వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానందం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు కిష్టయ్య, శ్రీనివాస రావు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి పక్కన వ్యర్థ పదార్థాలు పడేస్తే జరిమానా విధించాలి

జాతీయ రహదారి పక్కన చెత్త కుప్పలు పోసినవారిని గుర్తించి జరిమానా విధించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ సుజాతను ఆదేశించారు. కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి శివారులో డంపింగ్ యార్డ్‌ను మంగళవారం సందర్శించారు. పట్టణంలోని చెత్తను ఇక్కడికి తీసుకవచ్చి వేస్తారని కలెక్టర్‌కు కమిషనర్ వివరించారు. 16 ఎకరాల స్థలంలో డంపింగ్ యార్డ్ ఉందని చెప్పారు. ఇక్కడ వేసిన చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. 44 నెంబర్ జాతీయ రహదారి పక్కన ఫంక్షన్ హాల్స్‌కు సంబంధించిన వ్యక్తులు వ్యర్థపదార్థాలను పారేయడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. వ్యర్థ పదార్థాలు పారేసే వ్యక్తులను గుర్తించి జరిమానా విధించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

అవయవదానం చాలా గొప్పది

కామారెడ్డి, ఆగస్టు 13 : అవయవదానం అనేది చాలా గొప్పదని జిల్లా ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రామ్‌సింగ్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక పీజేఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ అవయవదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ హాజరై మాట్లాడారు. అవయవదానంతో మన తర్వాత కూడా మన అవయవాలు ఇతరులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సూర్య హెల్త్ ఆర్గనైజేషన్ రాజేంద్రకుమార్ విక్రం, కళాశాల చైర్మన్ గురువేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన సదస్సు

భిక్కనూరు, ఆగస్టు 13 : భిక్కనూరులోని విజ్ఞాన్ పాఠశాలలో అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. తాను మృతి చెందినా మరొకరి ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం అవయవ దానంతో కలుగుతుందని అన్నారు. అనంతరం ఇటీవల బ్రెయిన్ డెడ్ అయి అవయవదానం చేసినవారి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఎంఈవో ఎల్లయ్య, ఎస్సై సాయికుమార్ దోమకొండ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ మనోజ్, సిద్ధరామేశ్వర ట్రస్ట్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ కామారెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బా వసతి గృహం తనిఖీ

రాజంపేట్, ఆగస్టు 13 : మండలంలోని కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. వసతి గృహంలోని సదుపాయాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కనూ సంరక్షించాలి

బాన్సువాడ రూరల్, ఆగస్టు 13 : బాన్సువాడ మండలంలోని బోర్లం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు చైతన్య, మౌనిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ ఆర్ఐ సస్పెన్షన్

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 13: పెద్దకొడప్‌గల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పండరిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన రైతు సోమవారం ప్రజావాణి కొనసాగుతుండగా ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఆర్ఐ పండరి పట్టాదారు పాస్‌బుక్ కోసం రూ.20వేలు లంచం తీసుకున్నాడని, ఇవ్వడం లేదని పండరి ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. పండరి ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. కాగా పండరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

రైతు వేదికలకు తరలుతున్న రైతులు

రుణమాఫీ రాలేదని మీసాన్‌పల్లి రైతువేదిక వద్దకు వచ్చి వివరాలు తెలుసుకుంటున్న రైతులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 13: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ రాని రైతులు రైతు వేదికలకు తరలివస్తున్నారు. తమ రుణం మాఫీ కాలేదని వారు వ్యవసాయ శాఖ అధికారులకు వివరాలు ఇస్తున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని మీసాన్‌పల్లి రైతు వేదిక వద్దకు పదుల సంఖ్యలో రైతులు మంగళవారం తరలివచ్చారు. దీంతో అధికారులు ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలించి, కారణాలు వివరిస్తున్నారు. ఇంట్లో ఉద్యోగులకు పింఛన్ ఉంటే, ఇన్‌కంట్యాక్స్ కట్టేవారికి రుణమాఫీ కాలేదని అధికారులు తెలియజేస్తున్నారు.

వడ్డీ వ్యాపారి వేధింపులు తాళ లేక.. మహిళా బిల్డర్ ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి, ఆగస్టు 13: వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక మహిళా బిల్డర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కామారెడ్డి రూరల్ సీఐ రామన్, బాధితురాలి కథనం ప్రకారం.. కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన లక్ష్మీబాయి ఇండ్లు నిర్మించి విక్రయిస్తుంటుంది. అయితే, డబ్బులు అవసరం ఉండడంతో ఫైనాన్స్ వ్యాపారి విశ్వనాథం వద్ద రూ.32 లక్షలు అప్పుగా తీసుకున్నది. ఇందుకోసం ష్యూరిటీ కింద తన ఇంటితో పాటు రెండు ప్లాట్లను ఫైనాన్స్ వ్యాపారి పేరిట జీపీఏ చేసి ఇచ్చింది. అయితే, అప్పుగా తీసుకున్న రూ.32 లక్షలతోపాటు వడ్డీ రూపంలో ఇప్పటిదాకా రూ.కోటి చెల్లించింది. అప్పు తీరిపోవడంతో ప్లాట్‌ను తన పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని లక్ష్మీబాయి వడ్డీ వ్యాపారిని అడిగింది. ఇంకా రూ.56 లక్షలు కడితేనే ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని విశ్వనాథం చెప్పడంతో ఆమె షాక్‌కు గురైంది. తీవ్ర మనస్తాపం చెందిన లక్ష్మీబాయి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన దవాఖానకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వడ్డీ వ్యాపారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బాన్సువాడ రూరల్, ఆగస్టు 13 : బాన్సువాడ మండలం కోనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు, పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు మాజీ సర్పంచ్ వెంకటరమణారావు దేశ్‌ముఖ్, గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సర్పంచుగా పదవీ విరమణ పొందించిన వెంకటరమణారావును సన్మానించారు.

పంచాయతీ కార్యదర్శికి..

నాగిరెడ్డిపేట, ఆగస్టు 13: నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న సత్యనారాయణను గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను గుర్తించాలి

ఎల్లారెడ్డిలోని కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థినులకు సైబర్‌నేరాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 13: మనతో ఎవరైనా అనుచితంగా వ్యవహరించినా.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ చేసినా గుర్తించాలని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జా మహేశ్ విద్యార్థినులకు సూచించారు. ఎల్లారెడ్డిలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని తమ వద్ద షీ టీమ్‌కు సంబంధించిన 8712686094 సెల్ నంబర్‌ను ఉంచుకోవాలని, సైబర్ మోసాలకు గురైతే 1930కు కాల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు కళాబృందం, షీటీం సిబ్బంది, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశిస్తున్న డీఈవో రాజు

జిల్లా విద్యాశాఖ అధికారి రాజు

లింగంపేట, ఆగస్టు 13: పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సూచించారు. మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి, స్కూల్ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. ఆయనవెంట మండల పంచాయతీ అధికారి మలహరి, పంచాయతీ కార్యదర్శి అంజిబాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలి..

రామారెడ్డి, ఆగస్టు 13: మండలంలోని రెడ్డిపేట్, జగదాంబతండా గ్రామాలను మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రాజేశ్వర్ మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీలను పరిశీలించారు. రెడ్డిపేట్‌లో నిర్మించిన రూరల్ అంగడిబజార్‌ను సందర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులు నరేశ్, అరవింద్‌రెడ్డికి సూచించారు. ఆయనవెంట ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

యువకుడిపై ఎలుగుబంటి దాడి

లింగంపేట, ఆగస్టు 13: మండలంలోని పోల్కంపేట పంచాయతీ పరిధిలోని లక్యానాయక్ తండాకు చెందిన శ్రీనివాస్‌పై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచినట్లు తండవాసులు మంగళవారం తెలిపారు. గేదెలు తప్పి పోవడంతో శ్రీనివాస్ వాటిని వెతకడానికి మేడికుంద రాందాస్ పొలాల శివారులోకి వెళ్లాడు. అటవీ ప్రాంతంలో వెతుకుతున్న సమయంలో ఎలుగుబంటి తన పిల్లతో కలిసి దాడి చేసింది. తప్పించుకోవడానికి చెట్టు పైకి ఎక్కుతున్న సమయంలో ఎలుగుబంటి శ్రీనివాస్ కుడికాలును కరిచింది. దీంతో గాయపడ్డ అతడిని 108 అంబులెన్స్ వాహనంలో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా అశోక్

అశోక్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

బిచ్కుంద, ఆగస్టు 13: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(అటానమస్) ప్రిన్సిపాల్‌గా కొర్రి అశోక్‌ను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయన మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కాలేజీ అధ్యాపక బృందం, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. ఆయనకు మద్నూర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

బిచ్కుంద, ఆగస్టు 13: త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎంపీవో అబ్బాగౌడ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. వార్డుల వారీగా తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. సందేహాలు ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీవో అబ్బాగౌడ్

కార్గో ఏజెంట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, ఆగస్టు 13 : ఆర్టీసీ కార్గోలో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు మంగళవారం తెలిపారు. సెక్యూరిటీ డిపాజిట్ రూ. 5వేలు చెల్లించాలని సూచించారు. రాఖీ పండుగ సందర్భంగా రాఖీలు, స్వీట్లు అతి తక్కువ ఖర్చుతో వేగంగా భద్రంగా రవాణా చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆర్మూర్-7396889496, బోధన్ 9014296638, నిజామాబాద్ డిపో-1 9154298727, డిపో-2 7396889496, బాన్సువాడ 9154298729, కామారెడ్డి 9154298729, ఆర్ఎం 8639963647 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాటర్ ప్లాంట్ మోతె గ్రామ కమిటీ ఎన్నిక

లింగంపేట, ఆగస్టు 13: మండలంలోని మోతె గ్రామంలో బాలవికాస వాటర్ ప్లాంట్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సాయాగౌడ్ మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా గున్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మేడి సాయిలు, కార్యవర్గ సభ్యులుగా పాగల స్వామి, దరావత్ రతన్, ఏలేటి సంజీవరెడ్డి, రాములు, లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో వీడీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డితోపాటు గ్రామస్తులు భూమారెడ్డి, శివారెడ్డి, వెంకటి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు డైరెక్టర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ

ఇంటర్‌బోర్డు డైరెక్టర్ శ్రుతి ఓజాకు వినతిపత్రం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, అగస్టు13: ఇంటర్ కాలేజీ విద్యార్థుల ఇబ్బందులపై ఇంటర్ బోర్డు డైరెక్టర్ సృతి ఓజాను నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలేజీలో అధ్యాపకులను నియమించడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఆమె సానుకూలంగా స్పందించారని మాజీ జడ్పీటీసీ తెలిపారు. ఆయన వెంట లింగంపేట మండల నాయకుడు సూరేపల్లి గోపాల్‌రెడ్డి ఉన్నారు.

ప్రణాళికబద్ధంగా ఉపాధి పనులు చేపట్టాలి

ఉపాధి హామీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఆర్డీవో సురేందర్

బిచ్కుంద, ఆగస్టు 13: ఉపాధి హామీ పథకం పనులను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని డీఆర్డీవో సురేందర్ ఈజీఎస్ సిబ్బందికి ఆదేశించారు. బిచ్కుందలోని ఐకేపీ కార్యాలయాలన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగకుండా చూసుకోవాలన్నారు. వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. బిచ్కుంద తోపాటు గోపన్‌పల్లిలో మహిళా శక్తి బ్యాంకు లింకేజీ ద్వారా కొనుగోలు చేసిన గేదెలను, వాటికి వేస్తున్న ఆస్ట్రేలియన్ గడ్డిని పరిశీలించారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం సుధాకర్, ఏపీవోలు నాగరాజు, తిరుపతి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ముందుకు రావాలి

నస్రుల్లాబాద్, ఆగస్టు 13 : సొంతంగా వ్యాపారాలు చేయడానికి మహిళలు ముందుకు రావాలనీ డీఆర్డీవో సురేందర్ అన్నారు. బీర్కూర్‌కు చెందిన శ్రీదేవి అనే మహిళా సంఘం సభ్యురాలు బ్యాంక్ రుణంతో ఏర్పాటు చేసిన పాడి గేదెల యూనిట్‌ను డీఆర్డీవో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిగేదెల యూనిట్‌తో పాటు పౌల్ట్రీ ఫామ్‌ను కూడా మహిళలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, ఏపీఎం గంగాధర్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టును తయారుచేయాలి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 13: గ్రామ పంచాయతీల వారీగా ఓటరు లిస్టును తయారు చేయాలని డీఎల్పీవో సురేందర్ అన్నారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా నలుగురికి గాయాలు

నస్రుల్లాబాద్, ఆగస్టు 13 : బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద మంగళవారం ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా నవీపేట్ గ్రామానికి చెందిన వంశీకృష్ణ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా 10 మంది కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్తుండగా ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా కల్యాణ కట్ట వద్ద ఆటో వెనక్కి వచ్చి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా వారిని బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు.

హైదరాబాద్ తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్/ నాగిరెడ్డిపేట/మాచారెడ్డి, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణ బిల్లును సాధించిన అనంతరం మొదటిసారి హైదరాబాద్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం రాజధానికి తరలివెళ్లారు. ఆయనకు స్వాగతం పలికి, హైదరాబాద్‌లో నిర్వహించినపాదయాత్రలో కలిసి పాల్గొన్నారు. ఎల్లారెడ్డి నుంచి కంతి పద్మారావు, పౌలయ్య, మానయ్య, తిమోతి, యాదగిరి, నాగిరెడ్డిపేట నుంచి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కుంటోళ్ల యాదగిరి, మండల నాయకులు సాయిలు, ఎల్లమోల శ్రీనువాస్, పెద్ద సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి నుంచి ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బట్ట రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట్రాములు, కాశీరాం, నాగరాజు, కుమార్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ శిరీష

భిక్కనూరు, ఆగస్టు 13 : భిక్కనూరు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ శిరీష మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్త్రీలకు సంబంధించిన చట్టాలపై అవగాహన ఉండాలని సూచించారు. హెల్ప్‌లైన్ నంబర్ గురించి వివరించారు. కార్యక్రమంలో సాధికారిక సిబ్బంది శిరీష, శారద, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.